సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ౹ 3 ౹ జనవరి ౹ 2023





షాద్‌నగర్: వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు



చేవెళ్ల: శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి పుష్పాలంకరణ

వైకుంఠ వైభవం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆయా ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఎక్కడ చూసినా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరుడి మందిరాల్లో ఉత్తరద్వారం ద్వారా స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేశారు.



మీర్‌పేట: జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దర్శనం కోసం భక్తుల బారులు

న్యూస్‌రీల్

ప్రజావాణికి 85 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ హరిప్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి 85 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్‌ఓ జేఎల్‌బీ హరిప్రియ దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపించారు. సాధ్యమైనంత త్వరలో వాటికి పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి




శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

షాద్‌నగర్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి బిజయ్య అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఫెమినా మహిళా మండలి అధ్యక్షురాలు అలియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న మగ్గం వర్క్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగం రూపుమాపేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలియా సుల్తానా మాట్లాడుతూ.. మూడు నెలల పాటు 30 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది సబియా సుల్తానా, శిక్షకురాలు యాస్మిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను దగా చేస్తున్న ప్రభుత్వం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సర్పంచులను ప్రభుత్వం దగా చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను కేంద్రం నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తుండగా.. సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇతర అవసరాలకు మళ్లించడం అన్యాయమని అన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధుల మళ్లింపు అంశాన్ని నిరసిస్తూ పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టులకు పాల్పడడాన్ని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అరెస్టును ఖండించారు. సోమవారం ఆయన తన బృందంతో కలిసి ఇందిరాపార్కు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిపాలనలో పారదర్శకత కోసం స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని తీసుకొస్తే..తెలంగాణ ప్రభుత్వం దాన్ని స్వప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు.

తుదిదశకు 'ప్రక్షాళన'

పరిష్కారం దిశగా నిషేధిత భూములు

- జిల్లాలో ధరణి పోర్టల్‌కు 44,993 దరఖాస్తులు
- ఇప్పటికే 40,732 పరిశీలన పూర్తి
- పెండింగ్‌లో 8,287 పాస్‌బుక్ డేటా కరెక్షన్ అప్లికేషన్స్
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌లో వివాదాస్పద భూముల నమోదుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సృష్టించిన నిషేధిత భూముల జాబితా ప్రక్షాళన తుదిదశకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌కు ఇప్పటి వరకు 44,993 పీఓబీ దరఖాస్తులు రాగా, వీటిలో 40,732 దరఖాస్తులను పరిష్కరించారు. మిగిలిన వాటికి కూడా సాధ్యమైనంత త్వరలో పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. పీఓబీ జాబితాలో ఉన్న భూముల జాబితా పరిష్కారం కోసం కొద్ది రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మండలాల వారీగా తహసీల్దార్లు, ఇతర అధికారులు రోజుల తరబడి కలెక్టరేట్‌లో కూర్చొని నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను తొలగించారు. ఇదే జాబితాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సైతం సాధ్యమైనంత త్వరలో మోక్షం కల్పించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

సవాల్‌గా ఆ దరఖాస్తుల పరిశీలన

మ్యుటేషన్లు, వారసత్వ (విరాసత్) హక్కులు, నిషేధిత జాబితాలో భూములు, జీపీఏ, పాస్‌బుక్‌లలో దొర్లిన తప్పులు, కోర్టు కేసులు, నాలా కన్వర్షన్ దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ధరణి పోర్టల్‌కు చేరుతున్న విషయం తెలిసిందే. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం రెండేళ్ల క్రితం ధరణి పోర్టల్‌ను అందుబాటు లోకి తెచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోనే అత్యధికంగా జిల్లాలో 1,89,068 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటికే 1,73,966 పరిశీలన పూర్తయింది. క్షేత్రస్థాయి అధికారుల నుంచి భూ రికార్డుల వివరాలను తెప్పించుకుని వాటిని అనుమతించడమో, తిరస్కరించడమో చేశారు. ప్రస్తుతం కలెక్టర్ వద్ద 15,102 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా పాస్‌బుక్ డేటా కరెక్షన్‌కు సంబంధించిన (8,287) దరఖాస్తులే ఉండటం విశేషం. ఆ తర్వాతి స్థానంలో 4,261 పీఓబీ జాబితా దరఖాస్తులు, 1,054 కోర్టు కేసుల అమలుకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ఎంతో క్లిష్టమైన ఈ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది.

ఎప్పటికప్పుడు దిశానిర్దేశం..

ధరణి పోర్టల్‌కు అత్యధిక దరఖాస్తులు అందిన జాబితాలో జిల్లా ముందంజలో ఉంది. ఆయా దరఖాస్తులను పరిష్కరించడంలో భాగంగా కలెక్టర్ అమయ్‌కుమార్ ఎప్పటికప్పుడు తహసీల్దార్లు, ఆర్డీఓలు, ఇతర క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్షా స మావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. దరఖాస్తుల పెండింగ్ జాబితాను చాలా వరకు తగ్గించారు. మిగిలిన వాటికి పరిష్కారం చూపించడంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ధరణి పోర్టల్‌కు అందిన దరఖాస్తులు

అంశం	అందిన దరఖాస్తులు	పరిష్కరించినవి	పెండింగ్‌లో ఉన్నవి
మ్యుటేషన్	45,880	45,439	441
గ్రీవెన్స్ ఆఫ్ లాండ్ మేటర్స్	40,516	40,071	445
సక్సేషన్ విత్ అవుట్ పీపీబీ	7,051	6,935	116
ఎన్‌ఆర్‌ఐ పీపీబీ	582	557	25
పీపీబీ-సెమీ అర్బన్ లాండ్	1,482	1,442	40
ఇష్యూయన్స్ ఆఫ్ పీపీబీ ఇన్ కోర్టు కేసులు	2,992	2,710	22
నాలా విత్ అవుట్ పీపీబీ	1,034	1,012	22
ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	8,510	8,442	68
ప్రభుత్వ భూ సేకరణ సంబంధించినవి	2,357	2,316	41
కోర్టు కేసులు అండ్ ఇంటిమేషన్స్	22,001	20,947	1,054
పాస్‌బుక్ డేటా కరెక్షన్స్	10,330	2,043	8,287
ఆర్గనైజేషన్స్ పీపీబీ	320	310	10
ఖాతా మెర్జింగ్	1,020	1,010	10
పీఓబీ	44,993	40,372	4,261

శభాష్ అసద్



మంత్రి సబితారెడ్డికి నోట్‌పుస్తకాలు అందిస్తున్న అసద్

శంకర్‌పల్లి: తన పిలుపునకు స్పందించి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులతో నోట్‌పుస్తకాలు కొని తెచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థిని మంత్రి సబితారెడ్డి అభినందించారు. శంకర్‌పల్లికి చెందిన ఎండీ జిలానీ కుమారుడు అసద్ స్థానిక రేవతి పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలవడానికి వచ్చేవారు బొకేలు, శాలువాలకు బదులు పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ వస్తువులు అందించాలని ఇటీవల మంత్రి సూచించారు. విషయం తెలుసుకున్న అసద్ తనవంతుగా తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.1,500తో నోట్‌పుస్తకాలు కొన్నాడు. సోమవారం నగరంలో మంత్రిని కలిసి వాటిని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. వీటిని ఎలా కొన్నావని మంత్రి అడగడంతో విషయం చెప్పాడు. దీంతో మంత్రి శభాష్ అసద్ అంటూ అభినందించారు.

మ్యాట్‌ల అందజేత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతీక్‌జైన్ స్పందించారు. సోమవారం మర్యాద పూర్వకంగా ఆయన మంత్రిని కలిశారు. మంత్రి సూచన మేరకు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో కాకుండా అంగన్‌వాడీ పిల్లలకు సంబంధించిన మ్యాట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సబితారెడ్డికి మ్యాట్‌లు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

చిలుకూరులో భక్తుల సందడి

మొయినాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం.చిలుకూరులో ఉత్తర ద్వారం లేకపోయినా పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

వేతనాలు పెంచాలి

- కలెక్టరేట్ ఎదుట మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నీరందిస్తున్నా కార్మికులకు మాత్రం పస్తులు తప్ప డం లేదని అన్నారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదని.. ఈఎస్ఐ, పీఎఫ్ గుర్తింపు కార్డు ఇవ్వడం లేదని.. ఎనిమిది గంటల పని అమలు చేయడం లేదన్నారు. వెంటనే కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.24 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రవికుమార్, సహాయ కార్యదర్శి దివ్య ప్రతాప్, యూనియన్ నాయకులు వెంకటేశ్, రవి, యాదయ్య, బాలరాజ్, కార్మికులు పాల్గొన్నారు.

ఆ రెండు మార్గాల్లో అర్ధరాత్రి వరకూ మెట్రో

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్ కొనసాగినన్ని రోజులు రెండు రూట్లలో అర్ధరాత్రి 12 గంటల వరకు మెట్రో సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్ రూట్లలో.. చివరి స్టేషన్లయిన ఎల్బీనగర్, మియాపూర్, నాగోల్, రాయదుర్గం స్టేషన్ల నుంచి ఆఖరి రైలు అర్ధరాత్రి 12 గంటలకు బయలుదేరి గమ్యస్థానాన్ని రాత్రి 1 గంటకు చేరుకుంటుందని హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. జేబీఎస్-ఎంజీబీఎస్ రూట్లో చివరి రైలు మాత్రం రాత్రి 11 గంటలకు మాత్రమే బయలుదేరుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో గాంధీభవన్ స్టేషన్‌లో అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

తల్లిదండ్రులకు ఘనంగా పాదపూజ

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని జిల్లా బాలికా శిశు అభివృద్ధి అధికారి ఉషారాణి, ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య, జేఏసీ నాయకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో సోమవారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యాలయంలో పాపిశెట్టి శ్రీనివాస్ జ్ఞాపకార్థం పాపిశెట్టి కౌసల్య, కుమారస్వామి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి గుర్రం భద్రయ్య రచించిన గీతాహృదయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకట్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్రముఖ కవి డా.ఎల్లారెడ్డి, బాలస్వామి, శృతిలయ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు చిత్తరంజన్ దాస్, యోగా గురూజీ రమేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో తల్లిదండ్రులకు పాదపూజ

హెచ్‌ఎండీఏ భూములపై ప్రీబిడ్ సమావేశం

- మూడు జిల్లాల పరిధిలో 38 ల్యాండ్ పార్సెళ్లు
- ఈ నెల 4, 5, 6వ తేదీల్లో ప్రీ బిడ్ సమావేశాలు
- గూగుల్ ఎర్త్‌పై కేఎంఎల్ ఫైల్ సదుపాయంతో ప్లాట్ల పరిశీలన
- కొత్త పద్ధతిని అమల్లోకి తెచ్చిన హెచ్‌ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 38 ల్యాండ్ పార్సెళ్లలో స్థలాలను ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లాలో 13 ల్యాండ్ పార్సెల్స్, సంగారెడ్డిలో 17, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 8 ల్యాండ్ పార్సెళ్ల చొప్పున విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని అమ్మేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 4,5, 6 తేదీల్లో ప్రీ బిడ్ సమావేశాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 4న రంగారెడ్డి జిల్లా పరిధిలోని 13 ల్యాండ్ పార్సెల్స్ విక్రయాలకు వీలుగా బేగంపేట్ లోని టూరిజం ప్లాజా హోటల్లో ప్రీ బిడ్ సమావే శాన్ని నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లా పరిధి లోని 17 ల్యాండ్ పార్సెల్స్ విక్రయాలకు వీలుగా ఈ నెల 5న రుద్రారం సమీపంలోని గీతం యూనివర్సిటీ మీటింగ్ హాల్‌లో సమావేశం జరగనుంది. ఈ నెల 6న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఎనిమిది ల్యాండ్ పార్సెల్‌కు సంబంధించి ప్రీ బిడ్ సమావేశం బేగంపేట్‌లోని టూరిజం ప్లాజా హోటల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 15 వరకు అవకాశం..

ఈ సమావేశాల్లో ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు హాజరై భూముల వివరాలను తెలియజేస్తారు. ఔత్సాహికులు, కొనుగోలుదారుల అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు. వారి అనుమానాలను నివృత్తి చేస్తారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ల్యాండ్ పార్సెల్ కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు 17న ధరావత్తు (ఈఎండీ) చెల్లించాల్సి ఉంటుంది. 18న మొత్తం 38 ల్యాండ్ పార్సెళ్లకు ఆన్‌లైన్ (ఈ- వేలం)లో పాల్గొని సొంతం చేసుకోవచ్చు. మరోవైపు ఈ భూముల వివరాలను తెలుసుకొనేందుకు గూగుల్ ఎర్త్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్‌లో లేదా హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అమ్మకాలకు పెట్టిన ల్యాండ్ పార్సెల్‌ను కేఎంఎల్ ఫైల్ పద్ధతిలో గుర్తించడానికి వీలవుతుంది.

చదువులమ్మ చెట్టు నీడలో..

నేటి నుంచి ఓయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 'ఉస్మానియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో అలుమ్నీ మీట్- 2023

సాక్షి,సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ: ఒకే విద్యాలయంలో విద్యనభ్యసించి విశ్వవ్యాప్తంగా స్థిరపడి వివిధ హోదాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకునే అపూర్వ ఘట్టం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆవిష్కరణ కానుంది. విశ్వవిద్యాలయం చరిత్రలో తొలిసారిగా 'ఉస్మానియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు 'గ్లోబల్ అలుమ్నీ మీట్-2023' జరగనుంది. సమ్మేళనానికి సుమారు 1500 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతారని అంచనా. ఇప్పటికే సుమారు వెయ్యి మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు యూనివర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. రెండురోజుల పాటు జరిగే కార్యక్రమ నిర్వహణ కోసం ప్రత్యేకంగా 16 కమిటీలను ఏర్పాటు చేశారు. సమ్మేళనానికి హాజరయ్యే పూర్వ విద్యార్థులకు సహాయకులుగా ఉండేందుకు దాదాపు 300 మంది విద్యార్థులు వలంటీర్లుగా వ్యవహరిస్తారు.

కార్యక్రమాలు ఇలా..

- ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం గ్లోబల్ అలుమ్నీ మీట్ ప్రారంభమవుతుంది. తొలి రోజు వైస్ చాన్స్‌లర్ రీసెర్చ్ అవార్డులను ప్రదానం చేస్తారు. ముఖ్యంగా మొదటి రోజు విశ్వవిద్యాలయ అభివృద్ధి, ఇతర అంశాలపై పూర్వ విద్యార్థులు పలు బృందాలుగా ఏర్పడి చర్చలు జరుపుతారు. సాయంత్రం 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని లా' ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- బుధవారం పూర్వ విద్యార్థులు ఆయా విభాగాలను సందర్శించి, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకుంటారు. అనంతరం వివిధ అంశాలపై ఉపన్యాసాలుంటాయి. పూర్వ విద్యార్థుల కోసం క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్లలో భోజన సదుపాయం ఉంటుంది. ఆయా హాస్టళ్ల మెస్‌లలో ప్రస్తుత విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా ఏర్పాటు చేశారు. హాస్టళ్లలో జరిగిన నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు.

నేడు, రేపు స్పాట్ రిజిస్ట్రేషన్లు

గ్లోబల్ అలుమ్నీ మీట్- 2023కు హాజరయ్యేందుకు మంగళవారం, బుధవారం కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ల వెసులుబాటు ఉంది. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. రెగ్యులర్‌తోపాటు దూరవిద్య కేంద్రం ద్వారా వివిధ కోర్సులు పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

ఉస్మానియా ఫౌండేషన్ ఏర్పాటు

విశ్వవిద్యాలయ సమగ్ర అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు ప్రత్యేక ఉస్మానియా ఫౌండేషన్ ఏర్పాటైంది. విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆర్థిక చేయూతకు గల అడ్డంకులను అధిగమించేందుకు ప్రత్యేకంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎఫ్‌సీఆర్‌ఏకి కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కార్యాచరణ కోసం ప్రత్యేకంగా సీఏబీ డైరెక్టరేట్‌ను రూపకల్పన చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

షాద్‌నగర్ రూరల్: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కంసాన్‌పల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న పశు వీర్య ఉత్పత్తి కేంద్రంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 7మంది వ్యక్తులు పెయింటింగ్ పనులను చేస్తున్నారు. ఆదివారం నూతన సంవత్సరం వేడుకలలో భాగంగా వారందరు మద్యం సేవించారు. రాత్రి సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రంజిత్‌తివార(22) అనే యువకుడు పశువీర్య ఉత్పత్తి కేంద్రంలోని నీటి సంపులో పడిపోయాడు. తోటి కార్మికులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తిరిగి సోమవారం ఉదయం మరో సారి వెతుకున్న క్రమంలో రంజిత్ తివారి నీటి సంపులో కనిపించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రంజిత్‌తివారి మద్యం మత్తులోనే నీటి సంపులో పడి పోయాడా లేక మరేమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. మృతుడి బంధువు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

ఆక్యుపెన్సీ బాదుడు



సాధారణ నీటిబిల్లుకు మూడు రెట్లు అదనం

- జలమండలి అధికారుల తీరుతో బేజారు
- అవస్థల్లో శివారు మున్సిపల్ సర్కిళ్ల జనం

సాక్షి, సిటీబ్యూరో: 'నాచారం అన్నపూర్ణ కాలనీలో నల్లా కనెక్షన్ నంబర్.. 620194924కు ఇటీవల జలమండలి ఏకంగా రూ.21,185 నీటి బిల్లు జారీ చేసింది. ఇందులో నెలవారీ బిల్లు రూ.667 కాగా.. పాత బకాయిలు రూ.20,086 అని పేర్కొంది. బకాయిలపై వడ్డీ రూ.278 సూచించింది. లేట్ ఫీజు రూ.153.35గా పేర్కొంది. బిల్లు చూసిన సదరు వినియోగదారు నివ్వెరపోయారు'. జలమండలి నీటిబిల్లుల బాదుడుకు ఇదో ఉదాహరణ మాత్రమే. నగరంలో విలీనమైన శివారు మున్సిపల్ సర్కిళ్లలో వేలాది మందికి ఇటీవల సాధారణ బిల్లుకు మూడు రెట్ల అదనంగా నీటిబిల్లులు జారీ అవుతున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కాప్రా తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. మరికొన్ని ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు లేని డొమెస్టిక్ భవనాలకు సైతం వాణిజ్య కేటగిరీ కింద చూపి మూడు రెట్లు అదనంగా బిల్లులు జారీ చేస్తున్నారు. ఈ బాదుడుపై స్థానిక జలమండలి అధికారులు, సిబ్బందిని జనం సంప్రదిస్తే వారిచ్చే సమాధానం విని అవాక్కవుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు సైతం.. జీహెచ్‌ఎంసీ జారీ చేసిన ఆక్యుపెన్సీ ధ్రువీకరణ లేదంటూ బిల్లులు ఇచ్చి ముక్కుపిండి వసూలు చేస్తుండడంపై గగ్గోలు పెడుతున్నారు. బల్దియా చట్టాల ప్రకారం 200 చదరపు అడుగులలోపు విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లకు ఆక్యుపెన్సీ పత్రం అవసరం లేనప్పటికీ సిబ్బంది పట్టపగలే చుక్కలు చూపుతుండడంతో జనం బేజారవుతున్నారు. జలమండలి తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉచితానికి గండి కొట్టేందుకేనా?

రాష్ట్ర ప్రభుత్వం బల్దియా ఎన్నికలకు ముందు నెలకు ప్రతీ నల్లా వినియోగదారునికి ఉచితంగా 20 వేల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తామని ప్రకటించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పలు షరతులు విధించింది. ప్రతీ కనెక్షన్‌కు నీటి మీటర్ ఏర్పాటును తప్పనిసరి చేయడంతోపాటు,ఆధార్‌నెంబరును..కనెక్షన్ నెంబరుకు జత చేయాలని స్పష్టం చేసింది. ఇందుకు ఏడాదిన్నరకు పైగా గడువు కూడా ఇచ్చింది. సుమారు ఏడాదిపాటు అన్ని గృహ వినియోగ నల్లాలకు రూ.520 కోట్ల మేర బిల్లు బకాయిలను మాఫీ చేసింది. నిర్దేశిత గడువులోగా అనుసంధానం చేసుకోని వారికి ఏకంగా ఆరు నుంచి ఏడాది పాటు బిల్లులు జారీచేయడంతో అధిక నీటిబిల్లులతో జనం బేజారవుతున్నారు. ప్రభుత్వం ఉచిత నీళ్ల పథకానికి గండి కొట్టేందుకే సవాలక్ష షరతులు విధిస్తున్నారని వినియోగదారులు ఆక్షేపిస్తుండడం గమనార్హం.

ఆక్యుపెన్సీ సాకు..

ఆక్యుపెన్సీ ధ్రువీకరణ అన్న సాకుతో కేవలం గృహవినియోగ నల్లాలకు వాణిజ్య విభాగంలో నల్లా బిల్లులు ఇవ్వడాన్ని వినియోగదారులు తప్పుబడుతున్నారు. ఒకవేళ జలమండలి కేటగిరీ మారిస్తే ఆస్తిపన్ను జారీచేసే జీహెచ్‌ఎంసీ, విద్యుత్ బిల్లులు జారీ చేసే సీపీడీసీఎల్ సైతం సదరు భవనాలకున్న కనెక్షన్లను వాణిజ్య విభాగం కిందకు మారుస్తారన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జలమండలి వివరణ ఇదీ..

నగరంలో పలు ప్రాంతాల్లో జారీ అవుతున్న అధిక నీటి బిల్లులకు అడ్డుగా ఉన్న ఆక్యుపెన్సీ నిబంధన సడలింపు అంశంపై ప్రభుత్వానికి నివేదించామని జలమండలి అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని సెలవిచ్చారు.

అధిక బిల్లుల జారీ సరికాదు

ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలు లేని గృహ వినియోగ భవనాలకు (డొమెస్టిక్) జలమండలి నెలవారీగా రూ.800 జారీ చేస్తోంది. కొన్ని నెలలుగా కేపీహెచ్‌బీ పరిధిలోని రోడ్ నెం.1,2,3,4,5 పరిధిలో వందలాది మంది అధిక నీటిబిల్లుల జారీపై ఆందోళన చెందుతున్నారు. దీనిపై బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తక్షణం సాధారణ నీటిబిల్లులు జారీచేయాలని కోరుతున్నాం.

– వేమారెడ్డి, వినియోగదారుడు, కేపీహెచ్‌బీ

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: పీఆర్‌సీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నియమించాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని జెడ్పీహెచ్‌ఎస్ కొంగరకలాన్, ఎంపీపీఎస్ పటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి రాజు, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్ నాయక్, యాదగిరిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

యాచారం: సొంత మేనమామలా మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఆడపడుచులు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని 52 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ. 52,06,042 విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అర్హులు అర్జీలు పెట్టుకోవడం ఆలస్యం 15 రోజుల్లోనే చెక్కులు అందజేయడం జరుగుతోందన్నారు. ఐదేళ్ల కాలంలో మండలంలోని 1,600 మంది లబ్ధిదారులకు రూ. 16కోట్ల విలువ చేసే చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను దీవించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా రూ. 1.5కోట్ల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామని తెలిపారు. అనంతరం ఎంపీపీ కొప్పు సుకన్య మాట్లాడుతూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తీసుకుంటున్న చొరవ అభినందనీయమని అన్నారు. అర్హులైన పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరయ్యేలా చూడాలని ఆమె ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, తహసీల్దార్ సుచరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఫేస్‌బుక్ తెచ్చిన తంటా..!

- పెళ్లి చేసుకోవాలని వివాహితపై యువకుడి ఒత్తిడి
- నిరాకరించడంతో స్క్రూ డ్రైవర్‌తో దాడి
- నిందితుడికి దేహశుద్ధి
- పోలీసులకు అప్పగించిన స్థానికులు

ఇబ్రహీంపట్నం: ఫేస్ బుక్ పరిచయం ఓ వివాహితను ఇబ్బందుల పాలు చేసింది. ఈ ఘటన సోమవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ మారయ్య కథనం మేరకు.. కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మహిళ స్థానిక ఎంబీఆర్ నగర్‌లో నివాసం ఉంటోంది. భర్త రెస్టారెంట్ పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల కూతురు ఉంది. ఈమెకు ఫేస్‌బుక్ ద్వారా మంచాల మండలం రంగాపూర్‌కు చెందిన శివకాంత్(28)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని అడ్డం పెట్టుకొని యువకుడు తనను పెళ్లి చేసుకోవాలని బెదరింపులకు పాల్పడుతున్నాడు. సోమవారం ఏకంగా వివాహిత ఇంట్లోకి చొరబడి స్క్రూ డ్రైవర్‌తో ఆమె మెడ, చెంప, కూడి చేతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో బాధిత మహిళ, ఆమె అమ్మమ్మ కేకలు వేయడంతో నిందితుడు పారిపోయేందుకు యత్నించాడు. అదే భవనంలో ఉన్న వారు నిందితున్ని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కల్వకుర్తి అభివృద్ధికి సహకరించాలి

సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే 6వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కడ్తాల్ నుంచి సాలార్‌పూర్ మీదుగా పడకల్ గేట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించాలని కోరారు. కెఎల్ఐ, డీ 82 రైతులకు పరిహారం రూ. 27కోట్లు కావాలని విన్నవించారు. అలాగే ఇర్విన్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో సమగ్ర గిరిజనాభివృద్ధికి రూ. 250కోట్లు కేటాయించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు విషయంపై సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే తెలిపారు.



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మార్కెట్ కిరికిరి!

- అనుమతులు లేకుండా మండిని ప్రారంభించిన వ్యాపారులు
- తప్పపడుతున్న మార్కెటింగ్ శాఖ

సాక్షి,సిటీబ్యూరో: ప్రైవేటు మార్కెట్ వ్యవహారం కొత్త మలుపు తిరుగుతోంది. మార్కెటింగ్ శాఖ అనుమతులు తీసుకోకుండానే మండిని ప్రారంభించడం వివాదానికి దారి తీసింది. బాలాపూర్ మండలం, మామిడిపల్లిలో వక్ఫ్‌బోర్డు నుంచి 12 ఎకరాల స్థలాన్ని అద్దెకు తీసుకున్న వ్యాపారులు పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు భూమిని చదును చేసి స్థలాలను కూడా కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన చట్టంతో ఈ మండిని ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే మార్కెటింగ్ శాఖ జారీ చేసే లైసెన్సులకు అనుగుణంగా పండ్ల క్రయవిక్రయాలను అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వం నుంచి ఈ మేరకు అనుమతులు పొందకుండానే మంగళవారం ఫ్రూట్ మార్కెట్‌ను ప్రారంభించడం గందరగోళానికి తెరలేపింది. మార్కెట్ నిర్వహణ అంశం ఇంకా తమ పరిశీలనలో ఉందని, లైసెన్సుల జారీపై నిర్ణయం తీసుకోలేదని మార్కెటింగ్ శాఖ స్పష్టం చేస్తోంది. తాము లైసెన్సులు జారీ చేయనంత వరకు ఆ మండీకి అధికారిక గుర్తింపులేనట్టేనని తేల్చి చెబుతోంది. అయితే, వ్యాపారులు మాత్రం ప్రభుత్వం ఆధీనంలోని వక్ఫ్‌బోర్డే తమకు స్థలాన్ని కేటాయించినందున ఇంకా అనుమతులతో పనేముందని వాదిస్తోంది.

పాత కక్షలతో దాడి: వ్యక్తి మృతి

కడ్తాల్: పాత కక్షలు మనస్సులో పెట్టుకొని దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కడ్తాల్ మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాలార్‌పూర్ తండాకు చెందిన నేనావత్ మోహన్(30) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగిన మత్తులో గతంలో ఇదే తండాకు చెందిన నేనావత్ రఘుతో చిన్న గొడవ జరిగింది. ఆదివారం రాత్రి నేనావత్ మోహన్ ఒంటరిగా ఇంటికి వెళుతుండగా రఘు దాడి చేశాడు. దీంతో మోహన్‌కు తీవ్ర గాయాలై అక్కడే పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద కారకులపై కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లో ఆదివారం తెల్లవారుజామున మద్యం మత్తులో అతివేగంగా కారు నడుపుతూ ఇద్దరు పాదచారుల మృతికి కారకుడైన నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 304(2), 185 ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. రోడ్‌నంబర్-2లోని రాయల్ టిఫిన్ సెంటర్ ఎదుట శ్రీను (47), ఈశ్వరి (55) రోడ్డు దాటుతున్నారు. ఈ సమయంలో కారు నడుపుతున్న కొడాలి ప్రణవ్ వీరిని ఢీకొట్టాడు. దీంతో శ్రీను, ఈశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న ప్రణవ్‌తో పాటు పక్కనే కూర్చున్న శ్రీవర్ధన్‌పై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిద్దరూ మాదాపూర్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి మత్తులోనే కారులో దూసుకుపోతూ ఈ ప్రమాదానికి కారకులయ్యారు. ప్రణవ్, శ్రీవర్ధన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో వారిద్దరినీ సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

జియాగూడ: రాష్ట్ర ఆవిర్భావం అనంతరం వైకుంఠ ఏకాదశికి ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జియాగూడలోని శ్రీ రంగనాథస్వామి వారికి మంత్రి తలసాని దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీమహావిష్ణు విశ్వరూపం, మూలవిరాట్ రంగనాథుడు, క్షీరసాగరంలో కొలువుదీరిన భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథులను దర్శించుకున్నారు.